క్లుప్తంగా

వైభవంగా స్వామివారి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలో గల శ్రీ రుక్మిణి సత్యభామా సమేత పార్థసారథి స్వామి కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అధ్యాయనోత్సవ సహిత వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వేదపండితులు ప్రతాపురం గిరిధర చార్యులు, అర్చక స్వామి కృష్ణ చైతన్య ఆధ్వర్యాన కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వెంకటేశ్వరరావు, కొత్తూరు రాజా, బాల లీలా కృష్ణ, ఏపూరి పురుషోత్తం, తిరున గిరి వెంకటనర్సయ్య, భాస్కర్‌రావు, నరేష్, చక్రధర్, రాఘవయ్య, తులసీప్రసాద్, సుబ్బారావు, సత్యావతి, శారద, సీతా, లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

వేంసూరు: మండల పరిధిలోని రాయుడుపాలెంలె కొలువుదీరియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 నుంచి 21 వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. శనివారం స్వామికి అమ్మవార్లకు ఉత్సవారంభం, మంగళాశాసనము, తీర్థప్రసాద గోష్టి, విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహావచనము, రక్షాబంధనము, మృత్సంగ్రహణం, అఙ్కురారోహణ వైనతేయపటాదివాసం నిర్వహించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



వాసవీ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మధిర: మధిరలో వాసవీ అమ్మవారి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు.

శ్రీకన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీచంద్రమౌళేశ్వరస్వామి వారి ఆలయంలో(శివాలయం) శనివారం శ్రీ వాసవీ కన్యాకపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడులను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో పలువురు మహిళల చేత సామూహిక కుంకుమ పూజలు నిర్వహించి.. అన్న దానం చేశారు. అర్చకుడు ఎన్.గోపాలకృష్ణ అమ్మవారి జన్మదిన ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ నిర్వాహకులు కొప్పు పరమేశ్వరరావు, దూపగుంట్ల అప్పారావు, దొడ్డా అశోక్, నర్సింహారావు తదితరులున్నారు.

23న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ఏన్కూరు: మండల పరిధిలోని గార్లఒడ్డులో ఈ నెల 23న శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ శేషయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 21 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించి 23న రాత్రి 9గంటల 5నిమిషాలకు స్వామి కల్యాణం నిర్వహిస్తామని.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణమహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

20 నుంచి అమ్మవార్ల తిరునాళ్లు

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామంలో ఈ నెల 20 నుంచి 24 వరకు శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవార్ల తిరునాళ్ల వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గుర్రాల కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు కుడుముల మల్లిఖార్జున్‌రెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా 21న జల బిందెల, నడిగావు పూజా కార్యక్రమాలతో పాటు మండల స్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలపిఆరు. ఈ పోటీల్లో పాల్గొన దలిచిన టీమ్‌లు 21న ఉదయం 11గంటల్లోగా ఎంట్రీ ఫీజు రూ.500లతో 99482 32346, 98482 37931 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు. 22న అమ్మవార్లకు పసుపు–కుంకుమ, పూలు–పండ్లు, గాజులు–చీరలు సమర్పించనున్నారు. 23న అమ్మవారికి బోనాలు సమర్పణ, రాత్రికి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రోగ్రాం, 24న దీనబండారు కార్యక్రమంతో తిరునాళ్ల వేడులను ముగించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు వివరించారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలెన్నో..

- సారవంతం కానున్న నేల
- కలుపు నివారణకు దోహదం
- తప్పనున్న చీడపీడల బెడద
- భూ పొరల్లో పెరగనున్న తేమశాతం



వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

కల్లూరురూరల్: మండలంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమైనాయి. ముందుగా వరిమడులు, పంట చేలలో వేసవి దుక్కులు దున్నే ప్రక్రియ ప్రారంభించారు. కల్లూరు మండలంలోని సుమారు 38వేల ఎకరాల్లో వివిధ రకాల వరి పంటలు వేస్తున్నారు. మరో 8వేల ఎకరాల్లో పత్తి, మిర్చి, మొక్కజొన్న, పెసర తదితర పంటలు సాగు చేస్తున్నారు. సాగర్ ప్రధాన కాలువ ఆయకట్టు, మధిర బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు, చెరువులు, కుంటలు, లిఫ్ట్ ఇరిగేషన్ల కింద వరి పంట సాగవుతుంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రబి పంట సాగు చేయలేదు. ప్రతి ఏటా మే నెలలో తొలకరి వర్షాలు కురిసే సమయంలో రైతులు దుక్కులు దున్నుతారు.

ఎండాకాలంలో లోతుగా దున్నాలి..

వానాకాలం సాగుకు నెలరోజుల ముందు వేసవి దుక్కులు దున్నుకోవాలి. కానీ కొంతమంది రైతులు పంటకోత అనంతరం అలానే వదిలేస్తారు. దీంతో వాననీరు భూమిలోపలకి వెళ్లదు. కావున భూమిని దున్నడంతో నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది. దీని ప్రభావం పంట దిగుబడిపై చూపిస్తుంది. పంట కోత అనంతరం పంట అవశేషాలను లోతుగా దున్నడం వలన అవి భూమిలో కలిసిపోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. పంటలకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. కావున రైతులు చెత్త చెదారాలను కాల్చకుండా దున్నాలి.

తేమ సంరక్షణ, నేల క్షారత్వ తగ్గుదల..

లోతు దుక్కి దున్నడం వలన పైన ఉన్న మట్టి పొరలు నేల కింద ఉన్న తేమను సూర్యరశ్మి వేడికి తేమ ఆవిరి కాకుండా కాపాడతాయి. లోతు దిక్కు చేసిన నేలలో వర్షాలు పడినప్పుడు క్షరత్వ గుణాన్నిచ్చే లవణాలు పై పొరల నుంచి కిందికి జారిపోతాయి.

కలుపు నివారణ..

సాధారణంగా పంట లేని సమయంలో కలుపు మొక్కలు పెరుగుతాయి. ఈ కలుపు మొక్కలు నేలలోని నీరు పోషకాలను ప్రత్యక్షంగా గ్రహించి పంట దిగుబడిని తగ్గిస్తాయి. అదే విధంగా అనేక రకాల పురుగులకు శిలీంద్రాలకు ఆశ్రమాన్ని కల్పించడం ద్వారా పరోక్షంగా పంట నష్టానికి కారణమవుతాయి. కాబట్టి వేసవి లోతు దుక్కుల వల్ల పాతుకు పోయిన కలుపు మొక్కలు వాటి విత్తనాలు నేలపై పొరల్లోకి చేరడం వలన అధిక ఉష్ణోగ్రతకు గురై నశిస్తాయి. దీని వలన తర్వాత పంటలో కలుపు తక్కువగా ఉంటుంది.

భూ సారానికి రక్షణ..



వేసవి దుక్కుల వల్ల పంటల దిగుడిపై మంచి ప్రభావం ఉంటుంది. వేసవిలో దుక్కులు దున్నే ప్రక్రియ ఈ ప్రాంతంలో ఆనాదిగా వస్తోంది. ప్రతి రైతు వేసవిలో తొలకరి జల్లులు పడే సమయంలో దున్నుతారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో సాంకేతికత పెరిగింది. ఇప్పటికి కూడా గ్రామాల్లో రైతులు పశువులతో నాగలి దున్నుతున్నారు. ఎక్కువ భూమి కల రైతులు ట్రాక్టర్‌తో దున్నుతున్నారు.

– సాయిని నారాయణరావు, రైతు, పుల్లయ్యబంజరు,

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి..

- పట్టభద్రులకు పోల్ చిట్టీలు
- పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



పోల్‌చిట్టీ అందజేస్తున్న బీఎల్‌ఓ



సత్తుపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేంద్రగౌడ్

సత్తుపల్లిటౌన్: ఈ నెల 27న జగరనున్న ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. సత్తుపల్లి నియోజకవర్గంలో 17,345 మంది పట్టభద్రులు ఉండగా ఏన్కూరులో రెండు, కల్లూరులో 4, పెనుబల్లిలో రెండు, సత్తుపల్లిలో 10, తల్లాడలో 3, వేంసూరులో రెండు చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదే విధంగా ఏన్కూరులో 1,597 మంది, కల్లూరులో 3,720 మంది, పెనుబల్లిలో 2,451, సత్తుపల్లిలో 4,605, తల్లాడలో 2,686, వేంసూరులో 2,286 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే పట్టభద్రుల ఓటర్ల జాబితా తహసీల్దార్ కార్యాలయాలకు చేరాయి. ఈ ఎన్నిక బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నారు.

పోల్ స్లిప్పులు పంపిణీ..

పట్టభద్రుల ఓటర్లకు తహసీల్ నుంచి పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ అధికారులకు పోల్ స్లిప్పులు అందిస్తున్నారు. మూడురోజుల్లోగా పట్టభద్రుల ఓటర్లకు పోల్ స్లిప్పుల పంపిణీ చేపట్టాలని బూత్‌లెవల్ అధికారులకు రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేయటంతో పంపిణీలో బీఎల్‌ఓలు నిమగ్నమయ్యారు. ఈ పోల్ చిట్టీలో ఓటర్ సీరియల్ నంబర్‌తో పాటు భాగం సంఖ్య, ఓటర్ పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రం చిరునామా, పోలింగ్ తేదీ ముద్రితమై వచ్చాయి. ఈ వివరాల ఆధారంగా పోలింగ్ రోజు ఓటర్ జాబితాలోని వివరాలను సులభంగా గుర్తించేందుకు వీలవుతుంది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

పట్టభద్రుల ఉప ఎన్నికకు పోలింగ్ నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లపై శనివారం కల్లూరు ఆర్డీఓ ఎం.రాజేంద్రగౌడ్ సత్తుపల్లిలోని జేవీఆర్ కళాశాల, బలుర హైస్కూల్, బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాలలో వసతులను ఆరాతీశారు. ఈయన వెంట తహశీల్దార్ యోగీశ్వరరావు, ఆర్ఐలు నరేష్, జానిమియా, శివ, గోపి పాల్గొన్నారు.

సింగరేణి వంచిస్తోంది..

ఆగని లారీ యజమానులు ఆందోళనలు



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

సత్తుపల్లి: సింగరేణి సంస్థ బొగ్గు టెండర్లప్పుడు జీ–13 వేలంపాటలో పెట్టకుండా వంచిస్తోందని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కొండపల్లి రమేష్‌రెడ్డి, పీఎల్ ప్రసాద్ మండిపడ్డారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ ఫ్యాక్టరీలు బొగ్గు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవటం వల్లే లారీలకు లోడింగ్‌లు ఇవ్వలేక పోతున్నామని చెప్పటం సత్యదూరమన్నారు. సింగరేణి సంస్థ నిర్వహించే వేలంపాటలో జీ–13ను చూపించటం లేదని, అందుకే ఫ్యాక్టరీలు బొగ్గు కొనుగోలు చేసేందుకు రావటం లేదనే విషయాన్ని ఆలస్యంగా వెలుగు చూసిందన్నారు. ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం షాలేంరాజుతో మరో దఫా చర్చలు జరిపి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఐదురోజుల నుంచి బొగ్గు లారీలు కదలక సత్తుపల్లి ప్రాంతంలో ఆందోళనలు జరుగుతున్నాయనే విషయం తెలుసుకొని ఇల్లెందు లారీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె మౌలాన, జెమిని వెంకటేష్, ఎన్.శ్రీను, రషీద్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కె రఫీ, కొత్తూరు ఉమామహేశ్వరరావు సంఘీభావం ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటిరెడ్డి, ఎస్‌కె నజీర్, కోటా మోహన్‌రావు, ఐ.శ్రీను, ఎస్‌కె రఫీ, గుండు ప్రసాద్, చిన్నంశెట్టి సూరిబాబు, దురిశేటి శ్రీనివాసరావు, ఎస్‌కె లియాకత్, మునీర్, ఎస్‌కె సాధిక్, ఓలేటి సత్యనారాయణ, విజయ్‌కుమార్, వెంకట్, ఎస్‌కె రెహమాన్, ఎస్‌కె బాజీ పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

ఏన్కూరు: చిన్నారులకు క్రమం తప్పకుండ టీకాలు వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ తెలిపారు. మండల పరిధిలోని జన్నారం అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తల్లాడ: తల్లాడ బాలభారతి విద్యాలయంలో 2004లో చదువుకున్న పదోతరగతి విద్యార్థులు స్థానిక పాఠశాలలో శనివారం ఒకే వేదికపై చేరుఁని సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై రావడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. సమిష్టిగా భోజనాలు చేశారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీ వారు నిర్వహించిన ఈ క్యాంపస్ ఎంపికలలో 156 మంది విద్యార్థినులు పాల్గొనగా 58 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.మానస, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, సీజీసీ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి విద్యార్థినులకు జాబ్ ఆఫర్ లెటర్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాం అందించాలి



మహిళా శక్తి కుట్టుమిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఏ డీపీఎం దర్గయ్య

కల్లూరురూరల్: పాఠశాలలు ప్రారంభించగానే విద్యార్థులకు దుస్తులు అందించేందుకు కృషి చేయాలని డీఆర్డీఏ డీపీఎం దుర్గయ్య కోరారు. శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని కల్లూరు, పాయపూర్, చెన్నూరు, నారాయణపురంలలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాలను డీఆర్డీ డీపీఎం, కల్లూరు తహసీల్దార్ సాంబశివుడు పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న 2,817 మంది విద్యార్థులకు ఒక జత యూనిఫాం దుస్తులను తయారు చేసి అందించేందుకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మహిళా శక్తి సంఘాల కుట్టు మిషన్ కేంద్రాలలో విద్యార్థుల యూనిఫాం దుస్తులు తయారు చేస్తున్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, సీసీ రుక్మిణి పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి దేవాలయానికి వితరణ



వెండికిరీటం, పాదుకలు అందజేస్తున్న నరేష్ దంపతులు

కొణిజర్ల: మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బెజవాడ నరేష్, ప్రవళిక దంపతులు స్థానిక అంజనేయ స్వామి దేవాలయంలో స్వామి విగ్రహానికి రూ. 1.20 లక్షల విలువైన వెండి కిరీటం, పాదుకలు వితరణగా అందజేశారు. శనివారం ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు అలయ కమిటీ సభ్యులకు వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దండు దేవదాస్, వైస్ చైర్మన్ వేముల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కమటాల రేణుక, బెజవాడ వెంకటనారాయణ, పూజారి శేషగిరి శర్మ పాల్గొన్నారు.

ఈఏపీ సెట్‌లో బాలాజీకి 2,170వ ర్యాంక్..



హేమచంద్ర బాలాజీ

సత్తుపల్లి: ఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యాభారతి కళాశాలకు చెందిన కె.హేమచంద్ర బాలాజీకి 2,170వ ర్యాంక్ సాధించి సత్తుపల్లి పట్టణంలో మొదటి స్థానంలో నిలిచాడు. విద్యాభారతి కళాశాల ప్రిన్సిపాల్ జీవి లింగారెడ్డి, ఎం.సత్యనారాయణ, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

వైరారూరల్: రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఈఏపీసెట్ ఫలితాల్లో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు తెలిపారు. మొత్తం 61 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 55 మంది అర్హత సాధించారన్నారు. కుర్రా స్వాతియ 9,110 ర్యాంక్, వడ్డే శ్రీముఖి 10,170, బీరెల్లి వెంకటకృష్ణ 12,520, చావా సుధీర్ 18,000, దుగ్గినేని రమ్యశ్రీ 18,900, శీలం భావన 18,930 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కరస్పాండెంట్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏట నర్సింహారావు తదితరులు అభినందించారు.

తల్లాడలో వర్షం

తల్లాడ: తల్లాడలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండు వేసవిలో ఎండలు కాయాల్సిన తరుణంలో వర్షం జల్లులు కుస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమౌతుంది. ఈ ఏడాది ముందుగానే వర్షాలు ప్రారంభం కావటంతో వ్యవసాయ పనులు ముందుగానే ప్రారంభం కానున్నాయి.

ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

మధిర: మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష, క్లస్టర్ ఏపీడీ సీహెచ్.శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారులు శాస్త్రి, పవన్ పాల్గొని రికార్డులను తనిఖీ చేశారు. పలు గ్రామాల్లో చేపట్టిన అవకతవకలు జరిగాయని గుర్తించి రూ.97 వేలు రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ నేపథ్యాన ప్రజల సమక్షాన తనిఖీ చేపట్టడానికి అవకాశం లేకపోవడంతో కార్యాలయంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో అంబుడ్స్‌మెన్ రమేష్, ఎస్ఆర్పీ సాంబశివచారి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి



మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఎనిమిది వారాలైన డబ్బులు చెల్లించటం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎంఎల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ఆరోపించారు. మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీ పనుల సమయంలో గాయపడిన వారికి నష్ట పరిహారం, మూడు కిలోమీటర్ల దూరం వెళ్లిన వారికి రూ.100 చార్జీలు, గడ్డపార, తట్ట, మంచినీళ్ల, ఇతర వస్తువలకు రోజుకు రూ.20లు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంఎయూ ఆధ్వర్యంలో.. మండల కార్యాలయాల ముట్టడి నిర్వహించనన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యం, వరలక్ష్మి, రంజాన్, హమీద్, అజయ్, కృష్ణ, కోటమ్మ, వెంకటేశ్వరరావు, ప్రసాద్, హరిబాబు, కుమారి, రామారావు, సీతయ్య, లక్ష్మి, దుర్గా, చెన్నమ్మ, పావని, ప్రసన్న పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డికి ఓటు వేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

సత్తుపల్లి: పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. సత్తుపల్లిలో శనివారం నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశంలో జిల్లా నాయకుడు ఖమర్‌తో కలిసి మాట్లాడారు. ప్రతి ఒక్క పట్టభద్రున్ని కలుసుకొని గ్రామాల్లో ఓట్లను అభ్యర్థించాలని, బూత్‌లెవల్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముందుగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల శేషగిరిరావు మృతిపట్ల శ్రద్ధాంజలి ఘటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, పట్టణ అధ్యక్షుడు రఫీ, మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రామారావు, సంజీవరెడ్డి, మధు, రఘు, రాము, సాంబశివరావు, శ్రీను, కృష్ణారావు, అప్పారావు పాల్గొన్నారు.

తూములకు మరమ్మతులు చేపట్టాలి



వృథాగా పోతున్న చెరువునీరు

కారేపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరుతున్నాయని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి తూములకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరారు. మండలపరిధిలోని గాంధీనగర్ గ్రామంలో గల భూపతిరాయుని చెరువుకు సంబంధించిన తూములకు సరైన మరమ్మతులు చేయించాన్నారు. వాటికి షట్టర్లు లేకపోవడంతో రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి వచ్చిన వరద నీరు వృథాగా పోతుందన్నారు. గత ఏడాది కూడా నీరు వృథాగా పోవడంతో.. రైతులే మరమ్మతులు చేశారని, అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు.

బస్సు షెల్టర్ లేక అవస్థలు



బస్సుల కోసం ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- మండుటెండలో ప్రయాణికుల పడిగాపులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఏన్కూరు: మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ప్రధాన సెంటర్‌లో మహిళ ప్రయాణికులకు టాయ్‌లెట్ సౌకర్యం లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు కోసం నీరిక్షించాల్సిన సమయంలో అందుబాటులో టాయ్‌లెట్లు లేక యువతి, యువకులు కూడ ఇబ్బందులకు గురి అవుతున్నారు. మండలకేంద్రం నుంచి నిత్యం ఖమ్మం నుంచి భద్రాచలం, మాణుగూరుకు వందలాది మంది ప్రయాణికుల రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతో మండల కేంద్రం నుంచి ఇల్లందు రోడు ముచ్చర్లకు రాకపోకలు కొనసాగుతాయి. విద్యార్థులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, ప్రయాణికులు నిత్యం బస్సుల్లోనే రాకపోకలు కొనసాగిస్తారు. ప్రధాన సెంటర్‌లో బస్సు షెల్టర్ లేక పోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడస్తూ రోడ్డు పక్కన బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించింది.

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు..

గత కొన్ని సంవత్సరాల క్రితం బస్సు షెల్టర్ ఉండేది. అది శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రధాన సెంటర్‌లో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయకుండా పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసింది. దీంతో ఎవరికీ ఉపయోగం లేకుండా పోయింది. ప్రధాన సెంటర్‌లో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, ప్రయాణికులు పలుమార్లు ఎమ్మెల్యే, మంత్రుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ ఎవరు స్పందించడం లేదు. ప్రధాన సెంటర్‌లో బస్సు షెల్టర్ ఏర్పాటు చేసి ప్రయాణికులు ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు..



మండల కేంద్రం, ఖమ్మం నుంచి భద్రాచలం, మాణుగూరుకు వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో రోడ్డు పక్కన ఎండలో, వానలో బస్సుల కోసం ఎదురు చూస్తు ఉంటారు. ప్రయాణికుల సమస్యల తీర్చేందుకు బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి.

– భూక్యా చందులాల్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, కోనాయిపాలెం

టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలి..



బస్సు షెల్టర్‌తో పాటు టాయ్‌లెట్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలి. బస్సు కోసం ఎదురుచూసే ప్రయాణికులకు టాయ్‌లెట్ సౌకర్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలంలో రోడ్డు మీద వరద నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలి.

– భట్టు హనుమంతు రెడ్డి, ప్రయాణికుడు, అరికాయలపాడు